క్లుప్తంగా

ఉచిత శుద్ధజల కేంద్రం ప్రారంభం



నీటిని మహిళలకు అందజేస్తున్న వికాస్‌రావు-దీప

వేములవాడరూరల్: కరీంనగర్ ప్రతిమ ఫౌండేషన్ ద్వారా అన్ని గ్రామాల్లో అనేక సేవలందిస్తున్నామని ప్రతిమ ఫౌండేషన్ నిర్వాహకులు డా.చెన్నమనేని వికాస్‌రావు అన్నారు. వేములవాడ మండలంలోని ఫాజుల్‌నగర్ గ్రామంలో శుద్ధజల కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో కుట్టుమిషన్లు, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, వాటర్ ప్లాంట్‌లు, అంబులెన్స్‌లతో పాటు నిరుపేదలకు ఎన్నో సేవలు అందిస్తున్నామన్నారు. 15 ఏళ్లుగా మెడికల్ కాలేజీ ద్వారా ఉచితంగా వైద్య సేవలందిస్తున్నామని అన్నారు. అనంతరం బీరప్ప పట్నాలను దర్శించుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ దీప, ఎంపీపీ బండ మల్లేశం, సర్పంచ్ నాగుల వేణుగోపాల్, బీజేపీ మండల అధ్యక్షుడు జక్కుల తిరుపతి పాల్గొన్నారు.

పుస్తె మెట్టెలు అందజేత



పుస్తె మెట్టెలను అందజేస్తున్న నాయకులు

వీర్నపల్లి: మండలంలోని ఎర్రగడ్డ తండా గ్రామానికి చెందిన భూక్య ఐల, చీన్యా నాయక్ కూతురు మమత, మండల కేంద్రానికి చెందిన దేశరాజు చంద్రకళ, దేవయ్య కూతురు స్వప్న పెళ్లిళ్లకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు లగిసెట్టి శ్రీనివాస్ పుస్తెమట్టెలు, గాజులు, పెండ్లి చీరలను అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు గునుకుల దేవేందర్‌రెడ్డి వీటిని పెళ్లి కూతుళ్ల తల్లిదండ్రులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బోడ మల్లేశం, బానోత్ శ్రీనివాస్, సుమన్, కృష్ణరెడ్డి, రాజిరెడ్డి, రాజ్‌కుమార్, రమేశ్, శ్రీధర్‌రెడ్డి, వేణు, విజయ్, భాస్కర్, రామకృష్ణ పాల్గొన్నారు.

నిరుపేద అంత్యక్రియలపై కరుణ చూపాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలో అంతిమ సంస్కారాలు నిర్వహించలేని పేదల పరిస్థితిపై మానవతా దృక్పథాన్ని చూపించాలని కోరుతూ సిరిసిల్ల పౌర సంక్షేమ సమితి ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్‌కు బుధవారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెల్లరేషన్ కార్డు ఉన్న వారు కరీంనగర్‌లో ఒక్క రుపాయి చార్జీతో అంతిమ సంస్కారాలు చేసుకునేలా మున్సిపల్ కార్పొరేషన్ చర్యలు తీసుకుందన్నారు. సిరిసిల్ల మున్సిపల్ కూడా ఇదే పద్ధతిని అవలంభించాల్సిన అవసరం ఉందన్నారు. సిరిసిల్లలో నెహ్రూనగర్‌లోని వైకుంఠధామంలో రూ.6 వేలు, విద్యానగర్‌లోని వైకుంఠధామంలో రూ.7,500 వసూలు చేస్తున్నారన్నారు. మున్సిపల్ మాజీచైర్మన్ ఆడెపు రవీందర్, సమితి ప్రతినిధులు బలరాం, రాజమౌళి, అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

బడి, గుడి మునుగుడేనా.?

- అద్దె ఇంటిలో ప్రభుత్వ పాఠశాల
- పాఠశాలను నిర్మించాలని గ్రామస్తులు డిమాండ్
- ఆలయాలకు పరిహారం అందించాలి



ఆరెపల్లిలో అద్దె ఇంటిలో ప్రభుత్వ పాఠశాల



ఆరెపల్లిలో నీటిలో మునిగిన ప్రభుత్వ పాఠశాల

వేములవాడఅర్బన్: మిడ్ మానేరు ముంపులో ప్రభుత్వ పాఠశాల మునిగింది. దాంతో ఈ పాఠశాలను అద్దె ఇంటిలోకి మార్చారు. ఇప్పటికీ ఏళ్లు గడుస్తున్న పాఠశాలకు నూతన భవన నిర్మాణానికి మాత్రం నోచుకోలేదు. అలాగే గ్రామ ఆలయాలు మంపులోనే మునిగాయి. వాటికి కూడా ఇప్పటికీ నష్టపరిహారం అందించలేదని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని ఆలయాలకు, పాఠశాలకు పరిహారం అందించాలని కోరుతున్నారు.

వేములవాడ మండలం ఆరెపల్లి గ్రామంలో పాత గ్రామంలో అప్పుడు ఏళ్ల కిత్రం ప్రభుత్వ పాఠశాలను నిర్మించారు. దాంతో ఒక్కొక్కటిగా ఆ గ్రామంలోని ఇళ్లు కరీంనగర్-సిరిసిల్ల ప్రధాన రోడ్డులో నిర్మించుకున్నారు. కొన్ని ఇళ్లు ముంపులో మునిగాయి. దాంతో పాఠశాల అక్కడే ఉండిపోయింది. అయినా కూడా ఆ పాఠశాలలోనే పిల్లలకు చదువు కొనసాగింది. మిడ్ మానేరులో నీటిని నింపడంతో బ్యాక్ వాటర్ నీరు చేరి నాలుగేళ్ల నుంచి పాఠశాల నీటిలోనే మునుగుతూ తేలుతూ ఉంది. అప్పుడు సర్పంచ్ ఇటుకల నవీన గ్రామంలోని ఇల్లును అద్దెకు తీసుకుని పాఠశాలను ఏర్పాటు చేయించారు. అప్పటి నుంచి సుమారుగా నాలుగేళ్లుగా పాఠశాల అద్దెను, కరెంట్ బిల్లును తన స్వయంగా కట్టుతూ పాఠశాలను నడిపిస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటి వరకు నీటిలో మునిగిన పాఠశాలకు పరిహారం అందించలేదు. నూతనంగా పాఠశాలను నిర్మాణం చేయకపోవడంతో ఆ గ్రామ విద్యార్థులు తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. ఈ పాఠశాలలో సుమారుగా 30 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల భవనం నిర్మాణం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆలయాలకు పరిహారమేది?

గ్రామంలోని పోచమ్మ, శ్రీహనుమాన్ ఆలయాలు మిడ్ మానేరు బ్యాక్ వాటర్‌లో మునిగిపోయాయి. కాని ప్రభుత్వం వాటికి పరిహారం అందించలేదు. గ్రామంలో ఆలయాలు లేకుండా ఉండలేక గ్రామస్తులు చందాలు వేసుకుని ఈ రెండు ఆలయాలు నిర్మించుకున్నారు. కాని ఆ నీటిలో మునిగిన ఈ ఆలయాలకు పరిహారం అందిస్తే ఉన్న ఆలయాలను చుట్టూ ప్రహరీ వసతులు ఏర్పాటు చేసుకుంటామని గ్రామస్తులు అంటున్నారు. ఆలయాల పరిహారం అందించాలని కోరుతున్నారు.

పాఠశాల నిర్మించాలి



ఆరెపల్లి గ్రామంలోని పాఠశాల నీటిలో మునిగింది. అప్పటి నుంచి అద్దె ఇంటిలో పాఠశాల కొనసాగుతుంది. అధికారులు పట్టించుకుని నూతనంగా పాఠశాల భవన నిర్మించాలి.

– గుండెకార్ల లక్ష్మణ్, ఆరెపల్లి

నష్టపరిహారం అందించాలి



మిడ్ మానేరు బ్యాక్ వాటర్‌లో మునిగిన హనుమాన్, పోచమ్మ ఆలయాలకు పరిహారం అందలేదు. అధికారులు ఇప్పటికైనా నష్టపరిహారం వెంటనే అందించాలి.

– సిలివేని సంజీవ్, ఆరెపల్లి

పవర్ కట్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బోయినపల్లి: మండలంలోని వెంకట్రావుపల్లి 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని సెస్ రంగు నగేశ్ తెలిపారు.

సమాచారం

గురుకుల టీచర్ల ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

సిరిసిల్లకల్చరల్: ప్రభుత్వ గురుకులాల్లో ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తు చేసుకునే నిరుద్యోగ అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సర్కిల్ డైరెక్టర్ వెంకటస్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదాయం, రేషన్, ఆధార్ కార్డుతో పాటు విద్యార్హతల ధ్రువీకరణ జిరాక్స్ ప్రతులు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఆసక్తి గల నిరుద్యోగ అభ్యర్థులు తమ వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. శిక్షణ కాలంలో స్టైఫండ్‌తో పాటు స్టడీ మెటీరియల్ కూడా ఉచితంగానే అందజేస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 08729-223004 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

'పది'లో మెరిసిన ముత్యాలు

10 జీపీఏలు వారి సొంతం | విద్యార్థులకు అభినందన మాల | పాఠశాలల్లో సంబరాలు



నేవూరి హారిక



మహమ్మద్ రెహాన్



వైష్ణవిని అభినందిస్తున్న మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అరుణ్



గుర్రాల స్ఫూర్తి



కావేరి రోషిక్



వెన్నెల



న్యాలకొండ శ్రేయ



గోపాలకృష్ణ

ముస్తాబాద్: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ప్రైవేట్‌కు ధీటుగా ఫలితాలు సాధించి విజయకేతనం ఎగురవేశారు. ముస్తాబాద్ మండలం నామాపూర్ మోడల్ స్కూల్ విద్యార్థి చీకొడుకు చెందిన గున్నాల వైష్ణవి, ముస్తాబాద్ ఎస్సీ సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల విద్యార్థి కావేరి రోషిక్ 10 జీపీఏ సాధించారు. మోడల్ స్కూల్‌లో సాయి భువన్, అఖిల 9.8 సాధించారు. అలాగే ఆర్మిత, శ్రీజ, నిఖిత, సుష్మిత 9.7 జీపీఏ సాధించారు. ఆవునూర్ జెడ్పీ స్కూల్‌లో జి.సంతోష్ 9.8 సాధించాడు. వెన్నెల, దుర్గభవాని 9 జీపీఏ సాధించారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట జెడ్పీహెచ్ఎస్ నుంచి నేవూరి హారిక, మహమ్మద్ రెహాన్ 10 జీపీఏలు సాధించగా, గాజుల వైష్ణవి, సిరిసిల్ల పల్లవి, కొడిమ్యాల చందన 9.8 జీపీఏలు సాధించారు. రాచర్ల గొల్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని గుర్రాల స్ఫూర్తి 10 జీపీఏ, మారోజు భువన కృతి 9.7 జీపీఏ సాధించింది. రాచర్లబొప్పాపూర్‌లో తన్విక, తిమ్మాపూర్‌లో జి.స్ఫూర్తి 10 జీపీఏలు సొంతం చేసుకున్నారు.

ఇల్లంతకుంట: మండలం పెద్దలింగాపూర్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని వెగ్గళం వెన్నెల 10 జీపీఏ మార్కులు సాధించి మండల్ టాపర్‌గా నిలిచింది.

సిరిసిల్లఅర్బన్: మున్సిపల్ పరిధిలోని పెద్దూరులోని కేజీబీవీ విద్యార్థినులు సలేంద్రి అక్షయ, న్యాలకొండ శ్రేయ 10 జీపీఏ సాధించారు. సామల అక్షయ, బోగోజు ప్రశాంతి 9.8 జీపీఏ, గాజుల ప్రసన్న, మల్యాల సాత్విక 9.7 జీపీఏలో ఉత్తీర్ణులైనట్లు ప్రత్యేక అధికారిణి పావని తెలిపారు.

తంగళ్లపల్లి: తెలంగాణ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల నేరెళ్లలో జి.శ్రీవిద్య 10 జీపీఏ, పి.మాధవి, బి.అక్షయ, కే.సోని, ఏ.నేహ, డి.రమ్య, ఎం.మానస 9.7 సాధించారు, తెలంగాణ మోడల్ స్కూల్ మండెల్లిలో ఎం.జశ్వంత్, ఎం.రేవంత్, వి.శ్రీజ, జే.వైష్ణవి 9.8, జే.శ్యామల, బి.కీర్తన 9.7, ఎస్.అక్షయ, ఏ.వర్థిని, ఎస్.భరత్‌కుమార్, వి.రేవంత్, ఆర్.యశ్వంత్, ఎం.ధనుశ్రీ, వి.హర్షిత, జి.లిఖిత, ఏ.మహాలక్ష్మి, ఎస్.శ్రావణి, ఎస్.వైష్ణవి, ఎం.విశాల్‌లు 9.5 సాధించారు. బద్దెనపల్లి గురుకుల పాఠశాలలో కే.వర్షిత, ఈ.కీర్తన 9.7, పి.మానస, ఆర్.వర్షిని, పి.హన్సిక 9.5, ఆర్.అశ్రిత, పి.ఉష, కే.కీర్తన, కే.ప్రణవి 9.3, రేచల్ జ్యోతి, ఎం.అక్షయ 9.2, అక్షయ, సౌమ్య, చందన, ప్రియ, వైష్ణవి, కీర్తి, జి.అక్షయలు 9.0 జీపీఏ సాధించారు

వీర్నపల్లి: మండలంలోని ఆదర్శ పాఠశాలలో టాపర్ పెద్దిరెడ్డి కీర్తన 9.8, కేజీబీవీలో అడెపు భావ్యశ్రీ 9.2, హైస్కూల్‌లో కొమ్ము చైతన్య 8.5 జీపీఏ సాధించారు.

వేములవాడఅర్బన్: జ్యోతి బాపూలే గురుకుల బాలుర పాఠశాలకు చెందిన విద్యార్థి గోపాలకృష్ణ 10 జీపీఏ సాధించారు. గురుకుల ఎస్సీ బాలికల పాఠశాలకు చెందిన బి. శృతి 9.8, కస్తూర్బా విద్యార్థిని కళ్యాణి 9.8 జీపీఏ, జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ముస్కాన్, మోక్షిత 9.7, ఉన్నత పాఠశాలకు చెందిన అక్క చెల్లెలు సకినాల లహరి, లక్ష్మి 9.7 జీపీఏలు సాధించారు. అలాగే మైనార్టీ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థి వంశీకృష్ణారెడ్డి 9.5 జీపీఏ సాధించారు.

చందుర్తి: మండలంలోని మూడపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థిని సోమినేని వైష్ణవి 10 జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచింది.

కోనరావుపేట మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థులు పిట్టల సాయి అఖిల 9.8 జీపీఏ సాధించగా సుద్దాల పాఠశాలకు ఎ హర్షిణి 9.7, సాధించారు.

బోయినపల్లి: మండలంలోని కొదురుపాక హైస్కూల్‌లో చదువుతున్న ఎర్ర నాగరాజు 9.5 జీపీఏ, టీ. అభిరామ్ 9.3 జీపీఏ, విలాసాగర్ హైస్కూల్‌కు చెందిన ఇ. గాయత్రి 9.3, నర్సింగాపూర్ డీ. నందిని 9.3, మోడల్ స్కూల్ నక్క అరవింద్ 9.3, గురుకుల పాఠశాలకు చెందిన సీహెచ్. సుషాంత్ 9.3 జీపీఏలు సాధించి మండల టాపర్లుగా నిలిచారు. మోడల్ స్కూల్‌లో 78 మంది పరీక్షలు రాయగా, అందరూ ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ నిమ్మల సుధాకర్ తెలిపారు. కేజీబీవీలో 18 మందికి అందరూ ఉత్తీర్ణులయ్యారని ఎస్‌వో పద్మ పేర్కొన్నారు.

చదువులతోనే ఉన్నత శిఖరాలు

వేములవాడ: చదువులతోనే ఉన్నత శిఖరాలు అదిరోహించవచ్చని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ విద్యార్థులకు సూచించారు. 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన నెల్ల బృహనకృతి, ఆలంపల్లి దివిత, మల్యాల అక్షయ్, వాలద్రి హర్షిత్‌రెడ్డి, శ్రీసన్నిధి రాజ్యలక్ష్మి, గిరి వర్షి విద్యార్థులను బుధవారం అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్రీసన్నిధి వెంకటకృష్ణ, ఇప్పపూల వినోద్, ప్రిన్సిపాల్ కల్యాణ్ పాల్గొన్నారు.

సిరిసిల్లటౌన్: పట్టణంలోని పత్తిపాక, శివనగర్ సిద్ధార్థ ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు వి. అంజలి, డి. వెంకట్‌సాయి, వి. సిద్దార్థ, వి. సుచిష్మిత, వి. ప్రహర్షిత, బి. అభిజ్ఞ. కే. హృతిక, డి. స్ఫూర్తి, ఏ. వైష్ణవి 10 జీపీఏ సాధించారు. పాఠశాల చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, కరస్పాండెంట్ నాగుల సంతోష్‌గౌడ్, ప్రిన్సిపాల్స్ బిజ్జు, సుధాకర్ విద్యార్థులను అభినందించారు.

➡ శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు ఏ.భానుజ, జే. ప్రణవి, ఎల్. హర్షిత, ఎస్. శ్రీజ, వి. మనోజ్, పి. సాయిశ్రీలు 10 జీపీఏ సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ రాజిరెడ్డి, సిబ్బంది అభినందించారు.

➡ రేడియంట్ హైస్కూల్ విద్యార్థులు ఎం. రుత్విక, బి.భానుశ్రీలు 10 జీపీఏ సాధించగా, ఎస్. శరత్‌కుమార్(9.8), వి. సిద్దార్థ(9.8), ఎం. రాజశేఖర్‌రెడ్డి(9.7), జి. గన్నమనేని(9.7), ఎస్. అనంత కృష్ణప్రియ(9.5) జీపీఏ సాధించారు. వీరిని కరెస్పాండెంట్ మడుపు రాజు అభినందించారు.

➡ ఇంగ్లీష్ యూనియన్ విద్యార్థులు పి. సంజన (9.3), వి. వంధిత(9.3), జి. దీక్షిత(9.2), ఏ. నమృత(9.2), ఎం.జాగృతి(9.0) జీపీఏ సాధించారు. కరెస్పాండెంట్ రాజ్‌కుమార్ విద్యార్థులను అభినందించారు.





శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులను, రేడియంట్ విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో రమేశ్



విద్యార్థులను అభినందిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ

ఆధ్యాత్మికం

పోచమ్మ బోనాలు

చందుర్తి: మండలంలోని అనంతపల్లి గ్రామంలో పోచమ్మ తల్లికి ఇంటికో బోనాన్ని బుధవారం తీశారు. డప్పు, చప్పుళ్ల మధ్య మహిళలు బోనాలను ఎత్తుకుని భారీ ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, వేములవాడ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు ఏనుగు మనోహర్‌రెడ్డి, సర్పంచులు దేవేంద్ర, చిలుక అంజిబాబు, నాయకులు పాల్గొన్నారు.



అనంతపల్లిలో బోనాలతో మహిళలు

పోచమ్మ ఆలయ వార్షికోత్సవం


సిరిసిల్లటౌన్: కార్మిక క్షేత్రం సిరిసిల్లలోని సుప్రసిద్ధ పోచమ్మ ఆలయంలో వార్షికోత్సవం కనుల పండువగా జరిగాయి. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ హాజరై అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిపారు. లోక కల్యాణార్థం జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భక్తజనం ఎక్కువ సంఖ్యలో పాల్గొని జగన్మాతకు మొక్కులు తీర్చుకున్నారు. రెండు వేల మందికి అన్నదానం జరిపారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, ఆలయ ఈవో మారుతిరావు, చైర్మన్ సిరిగిరి మురళి, శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ ఉప్పుల విఠల్‌రెడ్డి, కౌన్సిలర్ గుడ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

శ్రీషిర్డి సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని వెంకటాపూర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీషిర్డీ సాయిబాబా ఆలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్ఠ వేడుకల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో వేదపండితులు శర్మ ఆధ్వర్యంలో ,అగ్ని, విగ్రహ ప్రతిష్ఠ, మంత్రహోమం, మంత్రబలి, తీర్థ ప్రసాద వితరణ, నివేదన కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. మూడు రోజుల వేడుకల్లో భాగంగా గురువారం నిర్వహించే వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేశారు.

సమస్యలు పరిష్కరించాలి

కోనరావుపేట: మండల కేంద్రంలో తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వీవోఏలు సమ్మె బాట పట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే వీవోఏలకు గౌరవ వేతనం రూ.26 వేలు అందించి, రూ.10 లక్షల బీమా సదుపాయాన్ని కల్పించాలన్నారు. ఈ సమ్మెలో వీవోఏలు మంజుల, రాజేశం, సుదీప్త, నంద్యాడపు సాగర్, వజ్రవ్వ, అన్ని గ్రామాల వీవోఏలు పాల్గొన్నారు.



సమ్మె చేస్తున్న వీవోఏలు

కోనరావుపేటలో చోరీ

- రూ.2.5 లక్షల అపహరణ

కోనరావుపేట: మండల కేంద్రంలో ఓ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన మామిడి లక్ష్మి-రాజు దంపతులు ఈ నెల 8న దైవదర్శనానికి వెళ్లి బుధవారం సాయంత్రం ఇంటికి చేరారు. ఇంటికి వచ్చి చూసుకునేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూస్తే బీరువాలో దాచిపెట్టుకున్న రూ.2.50 లక్షల నగదు లేకపోవడంతో దొంగలు ఎత్తుకెళ్లారని భావించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలాన్ని సీఐ కిరణ్‌కుమార్, ఎస్సై రమాకాంత్ క్లూస్ టీమ్ ద్వారా ఆధారాలు సేకరించారు.

రామాలయ భూమి కౌలు

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయ దత్తత దేవాలయమైన మామిడిపల్లి సీతారామచంద్రస్వామి వారి ఆలయానికి చెందిన 2.30 ఎకరాల భూమి కౌలుకు ఇచ్చేందుకు బుధవారం ఆలయ చైర్మన్ చాంబర్‌లో అధికారులు వేలం పాట నిర్వహించారు. దీంతో ఎక్కువ పాట పాడిన వెదిరె మనోజ్‌కు రూ.39 వేలు రెండేళ్ల కోసం అప్పగించారు. ఈ వేలం పాటలో ముగ్గురు రైతులు పాల్గొన్నట్లు ఏఈవో బ్రహ్మణగారి శ్రీనివాస్, పర్యవేక్షకులు శ్రీరాములు, ఆలయ ఇన్‌చార్జీలు నరేందర్, కమలాకర్ తెలిపారు.

ఏక్తా యాత్రకు తరలిరావాలి

సిరిసిల్లటౌన్: ఎంపీ బండి సంజయ్ ఆధ్వర్యంలో ఈనెల 14న కరీంనగర్‌లో నిర్వహించే ఏక్తాయాత్రకు ప్రజలు తరదలిరావాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ కోరారు.

పోస్టర్ విడుదల

ఇల్లంతకుంట: హిందూ ఏక్తాయాత్ర పోస్టర్‌ను బీజేపీ మండల అధ్యక్షుడు సంతోష్ బుధవారం విడుదల చేశారు.

కార్మికుల సంక్షేమానికి బాటలు


- మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ
- ఆటోనగర్ యూత్ అసోసియేషన్ ప్రమాణ స్వీకారం.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కళ

సిరిసిల్ల: అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం బాటలు వేస్తుందని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. బుధవారం ఆటోనగర్ యూత్ అసోసియేషన్ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆమె మాట్లాడారు. అసోసియేషన్‌కు మంత్రి కేటీఆర్ స్థలాన్ని కేటాయించారని ఆమె గుర్తు చేశారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ రాష్ట్రంలో అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మాట్లాడుతూ మెకానిక్ కార్మికుల సమస్యలను మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని అన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా పోతుల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా సయ్యద్ జాకీర్, పాతూరి యాదిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎం.డీ.ఎజాస్, కోశాధికారిగా రాగిపెల్లి కరుణాకర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా కుల్ల కిషన్ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో మెకానిక్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తడిసిన వెంకట్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, స్థానిక కౌన్సిలర్ పాతూరి రాజిరెడ్డి, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు ఎం.డీ.సలీం, ఆటోనగర్ యూత్ జిల్లా అధ్యక్షుడు కె.సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న భక్తులకు కోతుల బెడద



ఆలయ ప్రాంతంలో సంచరిస్తున్న కోతులు

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయంలో బుధవారం కోతులు హంగామా సృష్టించాయి. ఆలయ చలువపందిళ్లు, ప్రసాదాలు తయారు చేసే ప్రాంతం, క్యూలైన్లు, రాజేశ్వరపురం వద్ద గుంపులుగా వచ్చిన కోతులు భక్తులను బెదిరింపులకు గురి చేశాయి. చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళ భయంతో పరుగులు తీశారు.